క్లుప్తంగా

శ్రీలక్ష్మీనరసింహస్వామి సేవలో నారాయణ స్వామి



ఆలయం వెలుపల మాజీ ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి దంపతులు

కార్వేటినగరం/గంగాధర నెల్లూరు: తమిళనాడులోని షోలింగర్‌లో వెలసిన శ్రీలక్ష్మీనరసింహా స్వామివారిని రాష్ట్ర మాజీ ఉప ముఖ్యమంత్రి కళత్తూరు నారాయణస్వామి, ఆయన సతీమణి జెడ్పీటీసీ పరంజ్యోతి ఆదివారం షోలింగర్ మాజీ ఎమ్మెల్యే పార్తిబన్‌తో కలిసి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అర్చకులు వారికి పూర్ణకుంభంతో ఘనంగా స్వాగతం పలికారు. దర్శనం అనంతరం వారికి ఆస్థాన మండపంలో వేద పండితులు ఆశీర్వచనలు అందించారు. అలాగే స్వామివారి తీర్థ ప్రసాదాలను అందించారు. ఆలయం వెలుపల ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో అరాచకాలు, అక్రమాలు, అన్యాయాలు పెరిగిపోయాయని, ప్రజలకు రక్షణ కల్పించాలని స్వామివారిని వేడుకున్నట్లు చెప్పారు.

మహిళలపై కూటమి దాడులు దారుణం

నింద్ర: కూటమి ప్రభుత్వంలో ఎస్సీ ఎస్టీ బీసీ మహిళలపై దాడులు చేయడం రాజకీయం చేస్తున్నారని రాష్ట్ర వైఎస్సార్ కాంగ్రెస్ ఎస్సీ సెల్ కార్యదర్శి శ్యామ్‌లాల్ అన్నారు. మండల కేంద్రంలో ఆదివారం విలేకర్లతో ఆయన మాట్లాడుతూ, చంద్రబాబు రాజకీయ కక్షతో మహిళలపై దాడులు చేస్తున్నరని అన్నారు. మొన్న గుంటూరు జిల్లా తాడికొండ మండలం కంతేరు ఎంపీటీసీ సభ్యులు దళిత మహిళ శ్రీమతి దలపర్ల కల్పనను అర్ధరాత్రి చట్టవ్యతిరేకమైన చర్యలతో పోలీసులు దురుసుగా అరెస్టు చేయడం దారుణమన్నారు. నిన్న మాజీ మంత్రిపై కనీస గౌరవం ఇవ్వకుండా విడుదల రజనిపై సీఐ సుబ్బరాయుడు దురుసుగా ప్రవర్తించడం దుర్మార్గమన్నారు.

గంగ జాతరకు భారీ ఏర్పాట్లు



గంగాధర నెల్లూరు: మండలవ్యాప్తంగా మంగళ, బుధవారం జరగనున్న గంగ జాతరకు నిర్వాహకులు అంగరంగ వైభవంగా భారీ ఏర్పాట్లు చేశారు. మండల కేంద్రంలోని గంగాధర నెల్లూరు, వేల్కూరు, పెద్దకాలువ, రామానాయుడుపల్లిలో జరగనున్న జాతర ఉత్సవాల సందర్భంగా విద్యుత్ దీప కాంతులతో భారీ హోర్డింగులతో భారీ ఏర్పాట్లు చేశారు. మంగళవారం అమ్మవారి ప్రతిమను ఆవిష్కరించి ప్రత్యేక అభిషేకాలు, పొంగళ్లు, నైవేద్యాలు అంబళ్లు సమర్పించారు. బుధవారం సాయంత్రం నీవానది వద్ద జరిగే నిమజ్జనం వేడుకలు నిర్వహించేందుకు భారీ ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు.

రంగు నీళ్లు మాకొద్దు.. మంచినీళ్లు కావాలి

నగరి : పట్టణంలో అక్రమంగా వెలసిన డైయింగ్ యూనిట్లను తొలగించాలని సీపీఐ డిమాండ్ చేసింది. స్థానిక సీపీఐ కార్యాలయంలో పట్టణ కార్యదర్శి వేలన్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ నగరి నియోజకవర్గంలో ఎన్నో ఏళ్లుగా ఇబ్బంది పెడుతున్న రంగు నీటి సమస్యను పూర్తి స్థాయిలో పరిష్కరించాలని డిమాండ్ చేశారు. డైయింగ్ యూనిట్ నుంచి వెలువడే రంగు నీటి వల్ల తాగునీరు రంగు మారుతుందని చెప్పారు. స్థానిక పట్టణ ప్రజలతో పాటు, చుట్టు పక్కల గ్రామీణులు అనారోగ్యానికి గురవుతున్నారని తెలిపారు. పంట పొలాలు సైతం దిగుబడి లేక రైతులు నష్టపోతున్నారని పేర్కొన్నారు. చింతలపట్టిడలో సుమారు రూ.20 కోట్లు ఖర్చు పెట్టి నిర్మించిన ఈటీపీ ప్లాంటును పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని, ఈటీపీ ప్లాంట్ నిర్వహణ ఖర్చులను మరియు విద్యుత్ చార్జీలన్నీ డైయింగ్ యూనిట్ల యజమానుల ద్వారా కట్టించాలని, లేనిపక్షంలో రంగు నీటి సమస్య పైన సీపీఐ ఆధ్వర్యంలో పోరాటాలకు సిద్ధమవుతామని అన్నారు.

ముందుకు సాగని మురుగు

- వ్యర్థాలతో నిండిపోయిన మురుగునీటి కాలువలు
- దోమలు పెరిగి రోగాల బారిన ప్రజలు
- పట్టించుకోని మున్సిపల్ అధికారులు

పుత్తూరు: మున్సిపాలిటీలో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉంది. మురుగనీటి కాలువలు వ్యర్థాలతో నిండి, పూడిపోవడంతో మురుగు ముందుకు సాగడం లేదు. దీంతో డ్రెయిన్లు దోమల ఉత్పత్తి కేంద్రాలుగా మారడంతో రాత్రుల్లో ప్రజలకు కంటి మీద కునుకు లేకుండా పోతోంది. ఫలితంగా ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. దోమల నివారణకు మున్సిపల్ అధికారులు తీసుకుంటున్న చర్యలు మొక్కుబడిగా ఉంటున్నాయని ప్రజలు విమర్శిస్తున్నారు.

మురుగు పారితే ఒట్టు

పట్టణంలోని ప్రధాన డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా తయారైంది. వివిధ ప్రాంతాల కాలువలను ప్రధాన రహదారి డ్రైనేజీకి అనుసంధానం చేశారు. ఎలుకలు తవ్వడం, వ్యర్థాలతో పూడిపోవడంతో మురుగునీరు సజావుగా ముందుకు సాగడం లేదు. ఎక్కడి మురుగు అక్కడే నిలిచిపోతోంది. దీంతో తీవ్ర దుర్గంధం వెదజల్లుతోంది. పట్టణంలో ఉన్న హోటళ్లు, మాంసం దుకాణాలు, కూరగాయలు, జనరల్ స్టోర్స్ నిర్వాహకులు సైతం చెత్తను మురుగు కాలువలో వేయడంతో పరిస్థితి దారుణంగా తయారవుతోంది.

ఆక్రమణలు


వ్యాపారులు తమ దుకాణాల ముందు కాలువలను మూసివేసి దానిపై ఫ్లాట్‌ఫారాలు నిర్మించేశారు. గత ప్రభుత్వంలో నగరం రోడ్డు, కాపువీధుల్లో ఆక్రమణలు తొలగించారు. నేడు మళ్లీ యథాతథంగా ఆక్రమణలు, మురుగునీటి కాలువపై ఫ్లాట్‌ఫామ్స్‌ను నిర్మించుకున్నారు. అయినా మున్సిపల్ అధికారులు పట్టించుకున్న పాపాన పోలేదు.

ఏడాదిన్నరగా శానిటరీ ఇన్‌స్పెక్టర్ పోస్టు ఖాళీ!

సుమారు 60 వేల మందికి పైగా జనాభా కలిగిన పుత్తూరు మున్సిపాలిటీలో గత ఏడాదిన్నరగా శానిటరీ ఇన్‌స్పెక్టర్ పోస్టు ఖాళీగా ఉంది. ఏడాదిన్నర క్రితం శానిటరీ ఇన్‌స్పెక్టర్‌గా మోతీలాల్ పనిచేశారు. ఆయన బదిలీపై వెళ్లడంతో అప్పటి నుంచి నేటి వరకు ఆ పోస్టు ఖాళీగానే ఉంది. సచివాలయ కార్యదర్శుల్లో ఎవరినో ఒకరిని శానిటరీ ఇన్‌స్పెక్టర్‌గా మున్సిపాలిటీ మొత్తం బాధ్యతలను అప్పగించడం ద్వారా వారు పూర్తి స్థాయిలో పనిచేయలేకపోతున్నారు. సిబ్బంది సైతం ఇన్‌చార్జి ఇన్‌స్పెక్టర్ చెప్పినట్లు పని చేయకపోవడంతో పట్టణంలో పారిశుద్ధ్యం సమస్య రోజురోజుకూ తీవ్రతరమవుతోంది. పారిశుద్ధ్యంలో కీలక పాత్ర పోషించే మేస్త్రీ పోస్టు సైతం ఖాళీగా ఉండడం గమనార్హం.



ధర్మరాజుల ఆలయ సమీపంలో డ్రైనేజీ దుస్థితి



తిరుపతి రోడ్డులోని కోర్టుకు వెళ్లే దారిలో మురుగునీటి కాలువ దుస్థితి



బజారు వీధిలో మురుగునీటి కాలువపైనే నిర్మాణాలు



కేఎన్ రోడ్డులో మురుగునీటి కాలువ ఆక్రమణలు

మాజీ మంత్రి రజనిపై పోలీసుల తీరు దారుణం



మాట్లాడుతున్న కృపాలక్ష్మి

గంగాధరనెల్లూరు/కార్వేటినగరం : రాష్ట్రంలో రోజురోజుకూ రెడ్‌బుక్ అండతో టీడీపీ నాయకులు, కార్యకర్తలు రెచ్చిపోయి దాడులు చేసిన సంఘటనలు మరచిపోక ముందే, తాజాగా పోలీసులు రాష్ట్రానికి మంత్రిగా పని చేసిన విడుదల రజనిపై అమానుషంగా ప్రవర్తించడం దారుణమని గంగాధరనెల్లూరు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జ్ కృపాలక్ష్మి అన్నారు. ఆదివారం ఆమె మీడియాకు ఒక వీడియో విడుదల చేశారు. అందులో ఆమె మాట్లాడుతూ మాజీ మంత్రి విడుదల రజని పట్ల పోలీసులు వ్యవహరించిన తీరు జుగుప్సాకరంగా ఉందన్నారు. చిలకలూరిపేట రూరల్ సీఐ సుబ్బనాయుడు మాజీ మంత్రి విడుదల రజనిపై అనుచితంగా ప్రవర్తించడమే కాకుండా మాట్లాడితే నీపై కూడా కేసులు నమోదు చేస్తామంటూ బెదిరించడం చూస్తుంటే మహిళలకు రక్షణ ఎక్కడ ఉందన్నారు. రాష్ట్రంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ రచించిన రాజ్యాంగం అమలు కావడం లేదని, రెడ్‌బుక్ రాజ్యాంగం అమలు అవుతోందని ఆరోపించారు. మహిళలకు రక్షణ కల్పించాల్సిన పోలీసులే ఒక మాజీమంత్రి అనేది కూడా మరచి ప్రవర్తించడం హేయనీయమన్నారు. అనుచితంగా ప్రవర్తించిన సీఐ సుబ్బనాయుడుపై రాష్ట్ర ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని, లేకుంటే రాష్ట్రవ్యాప్తంగా మహిళలతో కలిసి ఉద్యమం చేస్తామన్నారు.

గంగమ్మ కొలుపు ప్రారంభం

నింద్ర: మండల కేంద్రంలోని యాదవ వీధిలో ఆదివారం గంగమ్మ కొలుపు ప్రారంభమైంది. రెండు రోజుల పాటు జరిగే కొలుపు కార్యక్రమంలో ఆదివారం గంగమ్మ జీవిత కథను వివరించారు. అనంతరం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం అమ్మవారి గుడిలో పూజలు చేసి రాత్రి గుడిలో గంగమ్మను ప్రతిష్ఠ చేపడుతున్నట్లు తెలిపారు.



గంగమ్మ కొలుపు పూజలు

ఈకేవైసీ విధిగా చేయించుకోవాలి

చిత్తూరు రూరల్ (కాణిపాకం): రేషన్‌కార్డు ఉన్న ప్రతి ఒక్కరూ విధిగా ఈకేవైసీ చేయించుకోవాలని డీఎస్‌ఓ శంకరన్ తెలిపారు. ఇందులో పిల్లలకు, 80 ఏళ్లు దాటిన వృద్ధులకు మినహాయింపు ఉందన్నారు. ఇప్పటివరకు ఈకేవైసీ చేయించుకోని సభ్యులు గడువులోపు పూర్తి చేసుకోవాలన్నారు. త్వరలో ప్రభుత్వం ఉచితంగా స్మార్ట్ రేషన్ కార్డులను అందించనుందని ఆయన పేర్కొన్నారు.

దరఖాస్తు చేసుకోండి

గుడిపాల: రేషన్‌కార్డు లేని వారు దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దార్ జయంతి మండల ప్రజలకు సూచించారు. ఆమె మాట్లాడుతూ దరఖాస్తు దారులు తప్పనిసరిగా ప్రజా సాధికార సర్వేలో నమోదై ఉండాలన్నారు. కొత్తగా పెళ్లయిన వారు వివాహ ధ్రువీకరణ పత్రంతో దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. పూర్తి వివరాలతో సమీప గ్రామ సచివాలయంలో సంప్రదించాలన్నారు. పాత కార్డులకు సంబంధించి మార్పులు, చేర్పులకు కూడా ప్రభుత్వం అవకాశం కల్పించిందన్నారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అలరించిన దుర్యోధన వధ





వెదురుకుప్పం: తలపడుతున్న భీమ, దుర్యోధన పాత్రధారులు, పాలసముద్రంలోనూ..

వెదురుకుప్పం: మండలంలోని నల్లవెంగనపల్లి గ్రామంలో వెలసిన శ్రీద్రౌపదీ సమేత ధర్మరాజులు ఆలయంలో నిర్వహిస్తున్న వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం దుర్యోధన ఘట్టం అట్టహాసంగా జరిగింది. ఉదయం ఆలయ అర్చకులు అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు చేపట్టి, భక్తులకు సర్వదర్శనం కల్పించారు. మధ్యాహ్నం హరికథా గానం భక్తులను ఆకట్టుకుంది. అనంతరం దుర్యోధన ఘట్టం ప్రదర్శించారు. గంగమడుగులో దాక్కున్న దుర్యోధనున్ని భీమసేనుడు బయటకు రప్పించే ఘట్టం చూపరులను ఆకట్టుకుంది. దుర్యోధన పాత్రధారి పలువురిని కంటతడి పెట్టించాడు. భీమ, దుర్యోధనుల యుద్ధ సన్నివేశం ప్రజల కళ్లకు కట్టినట్లు ప్రదర్శించారు. అనంతరం ధర్మరాజుకు పట్టాభిషేకం చేశారు. కంకణం కట్టుకున్న భక్తులు అగ్నిగుండ ప్రవేశం చేసి, తమ మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ ఆవరణలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

పాలసముద్రంలో

పాలసముద్రం : మండలంలోని కృష్ణజమ్మపురంలో వెలసిన ధర్మరాజులస్వామి మహాభారత ఉత్సవాల్లో భాగంగా ఆదివారం జరిగిన గధాయుద్ధం, దుర్యోధన వధ ఘట్టాలు ఆద్యంతం ఆకట్టుకున్నాయి. వేణుగోపాల నాట్యబృందంలో భీమసేనుడిగా గోవిందన్, దుర్యోధనుడిగా సుధాకర్ ఆకట్టుకున్నారు. దుర్యోధనున్ని భీముడు వధించే సన్నివేశాన్ని కళాకారులు రక్తి కట్టించారు. ఉత్సవాలను తిలకించేందుకు స్థానికులతో పాటు తమిళనాడు ప్రజలు వచ్చారు.

ఘనంగా అంజేరమ్మ మహాకుంభాభిషేకం



ఆలయ గోపుర కలశాన్ని ప్రతిష్ఠిస్తున్న వేదపండితులు



అమ్మవారిని దర్శించుకుంటున్న మాజీ మంత్రి ఆర్కే రోజా



నూతన ఆలయంలో ప్రతిష్ట చేసిన అంజేరమ్మ విగ్రహం

వడమాలపేట (విజయపురం): వడమాలపేట మండలం ఎస్‌వీపురంలో నూతనంగా నిర్మించిన శ్రీ అంజేరమ్మ ఆలయంలో ఆదివారం మహాకుంభాభిషేకం మహోత్సవం ఘనంగా జరిగింది. ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించి, పచ్చని తోరణాలు ఏర్పాటు చేశారు. అక్కడక్కడా అమ్మవారి ప్రతిమ కలిగిన కటౌట్లు ఏర్పాటు చేశారు. ఉదయం నుంచి భక్తుల సందడితో అమ్మవారి ఆలయం కిటకిటలాడింది. వేద పండితుల వేదమంత్రాల నడుమ అమ్మవారి విగ్రహాన్ని ప్రతిష్ఠ చేసి హోమం నిర్వహించారు. గ్రామ పురవీధుల్లో అమ్మవారి 108 కలశాలతో ఊరేగించారు. అమ్మవారిని దర్శించుకున్న భక్తులు ప్రసాదం, అన్నదానం చేశారు.

మాజీ మంత్రికి ఘన స్వాగతం

ఎస్‌వీపురంలో నిర్మించిన అంజేరమ్మ నూతన ఆలయ మహా కుంభాభిషేకం మహోత్సవంలో మాజీ మంత్రి ఆర్కే రోజా పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు ఆర్కే రోజాకు ఘన స్వాగతం పలికారు. అమ్మవారి ప్రసాదాలతో ఆలయ వేద పండితులు సత్కరించారు. ఆమె వెంట పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



పురవీధుల్లో 108 కలశాలను ఊరేగిస్తున్న భక్తులు

చెవుటి గంగమ్మకు పాలాభిషేకం

పాలసముద్రం : మండలంలోని కృష్ణజమ్మపురం పంచాయతీ బలిజకండ్రిగ గ్రామంలో వెలసిన చెవుటి గంగమ్మతల్లికి కొలువు మహోత్సవాల్లో భాగంగా ఆదివారం పాలాభిషేకం, అంబలి పోసే కార్యక్రమం కోలాహలంగా జరిగింది. ఉదయం ఆలయ అర్చకుడు అమ్మవారి ఎదుట కలశం పెట్టి గణపతి హోమం, నవగ్రహ హోమం, శాంతి హోమాలు చేశారు. హోమంలో ఉంచిన కలశ నీటితో అమ్మవారిని అభిషేకించారు. అంతకుముందు ఉదయం 10 గంటలకు ప్రతి ఇంటి నుంచి మహిళలు అంబలి, పాలు, పసుపు నీటి బిందెలతో మంగళ వాయిద్యాలతో అమ్మవారి దేవస్థానానికి చేరుకున్నారు. ఆలయ అర్చకులు, భక్తులు తీసుకొచ్చిన పాలు, పసుపు నీటితో అమ్మవారిని అభిషేకించారు. ఈ సందర్భంగా ఆలయం భక్తులతో కిటకిటలాడింది. అభిషేకాలు పూర్తయిన తర్వాత అమ్మవారిని అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు.



ప్రత్యేక అలంకరణలో చెవుటి గంగమ్మ



అమ్మవారికి మొక్కులు తీర్చుకునేందుకు వచ్చిన భక్తులతో కిటకిటలాడుతున్న ఆలయం

ఆత్మీయ సమ్మేళనం

నగరి : వారంతా చిన్ననాటి స్నేహితులు, 32 యేళ్ల క్రితం పట్టణ పరిధిలో ఉన్న పెరుమాళుగుడి వీధిలోని ప్రాథమిక పాఠశాల వారి స్నేహానికి పునాది వేసింది. 1993లో 5వ తరగతి చదివిన వారు ఆదివారం పాఠశాలలో ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటుచేసుకున్నారు. ఆ త్మీయ పలకరింపులు, ఆలింగనాల నడుమ నాటి మధుర స్మృతులను నెమరేసుకున్నారు. గురువులు లక్ష్మీకాంతం, భానుమతిని సత్కరించారు. సహకరించిన హెచ్‌ఎం సురేష్‌కు కృతజ్ఞతలు తెలుపుకున్నారు.



అపూర్వం

పాలసముద్రం : మండలంలోని బలిజకండ్రిగ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2005–06 సంవత్సరంలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం వారు చదివిన స్కూల్లోనే కలుసుకున్నారు. దాదాపు 20 ఏళ్ల తరువాత ఎక్కడెక్కడో ఉన్న వారంతా ఒకే చోట కలుసుకోవడం విశేషం. నాటి మధుర జ్ఞాపకాలను వారు గుర్తు చేసుకున్నారు. అప్పట్లో విద్య నేర్పించిన గురువులు లింగమూర్తి, మార్కొండ నాయుడుకు పాదపూజ చేసి ఆశీర్వాదం తీసుకున్నారు. విద్యార్థులందరూ కలిసి పాఠశాలకు ఫ్యాన్లను వితరగా అందించారు. గురువులను శాలువలతో సత్కరించారు.

